ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
శనివారం 8 ఫిబ్రవరి 2025



'స్థానికం'లో బీసీల హవా!



కులగణన పూర్తయింది. 2014లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36,46,955మంది జనాభా ఉండగా.. అందులో బీసీలు 14,28,043మంది ఉన్నట్టు గుర్తించారు. నాడు బీసీ జనాభా 40శాతానికి పైగా ఉన్నట్టు లెక్కల్లో తేలగా.. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనలో ఆ సంఖ్య మరింత పెరిగి.. 45శాతానికిపైగా బీసీ జనాభా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర సర్కారు వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెబుతోంది. అందులో భాగంగానే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి వేదికగా బీసీలకు ఇచ్చిన స్థానికసంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల హామీ అమలుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అదే సమయంలో తమకిచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ బీసీ సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తాచాటిన విషయాలపై విస్తృత చర్చ జరుగుతోంది. నాడు 22శాతమే రిజర్వేషన్ ఉన్నా.. కేటాయించిన స్థానాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు జనరల్ స్థానాల్లోనూ వారు పైచేయి సాధించారు. ఇక ఈసారి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీల ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గత పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల్లో వారిదే పైచేయి

- పెరిగిన జనాభాతో ఈ సారి రెట్టింపు కానున్న రిజర్వేషన్ కోటా
- నాడు 22శాతం సీట్లు.. ఇప్పుడు 42శాతం అమలైతే పెరగనున్న ప్రాతినిధ్యం
- పోయిన ఎన్నికల్లో పలు జనరల్ స్థానాల్లో ఉన్నత వర్గాలను ఢీకొట్టి నెగ్గిన వైనం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల్లో సత్తా
- మానుకోటలో జడ్పీటీసీ రిజర్వుకాకున్నా రెండు జనరల్ స్థానాలు కైవసం
- గిరిజనులు అధికంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో బీసీ సీట్లకు కోత

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కుల గణన పూర్తయి.. బీసీ జనాభా లెక్కలు తేలడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేయాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. కులగణన నివేదిక ప్రకారం రాష్ట్ర జనాభాలో సగానికి పైగా బీసీలున్నారని స్పష్టత రాగా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని బీసీ సంఘాల నేతలు ఆందోళనలకు దిగుతున్నారు. ఈ సారి కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. అయితే గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో 22శాతమే రిజర్వేషన్ అమలు చేసినా.. వారిదే హవా కనిపించింది. చాలా జనరల్ స్థానాల్లో బీసీ సామాజిక వర్గ అభ్యర్థులు సత్తా చాటి విజయం సాధించారు. నాటి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ చైతన్యం ప్రదర్శించిన బీసీలు.. ఉమ్మడి జిల్లాలోని పలు జనరల్ స్థానాల్లో ఉన్నత వర్గాలను ఢీకొట్టి నిలిచారు. పంచాయతీలతో పాటు మెజారిటీ ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో విజయం సాధించి సత్తా చాటారు.

స్థానికంలో కోటాపై బీసీల ఫైట్..

వచ్చే నెలలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి కాగా, తాజాగా మునిసిపల్ పాలక వర్గాల గడువు కూడా తీరింది. దీంతో స్థానిక సంస్థలు అన్ని కూడా ఇంచార్జ్ అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. దీంతో ప్రభుత్వం మార్చి నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో బీసీ కులాల నుంచి రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ కులగణన కూడా పూర్తి చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. బీసీ ఈ గ్రూపుతో కలిపి బీసీలు రాష్ట్రంలో 50శాతానికి పైగా ఉండటంతో 42శాతానికి పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌ను బీసీ సంఘాలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 36,46,955మంది జనాభా ఉండగా, ఇందులో

మిగతా 7వ పేజీలో...

'మహా' ఘట్టానికి అంకురార్పణ

- కాళేశ్వరంలో అంగరంగ వైభవంగా కుంభాభిషేకం
- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు
- 42 ఏళ్ల తర్వాత ఘనంగా వేడుకలు

7లో..



కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు



కాళేశ్వరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ముఖాముఖి



రేగళ్ల రాము
భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్

దళారులను నమ్మి మోసపోవద్దు

- రేగళ్ల రాము, భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్

ఆంధ్రజ్యోతి: ఎన్ని రకాల రిజిస్ట్రేషన్స్ అందుబాటులో ఉన్నాయి?

సబ్ రిజిస్ట్రార్ : మన దగ్గర సేల్, గిఫ్ట్ డీడ్స్, మార్టిగేజ్, డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ జరుగుతున్నాయి. మ్యారేజ్ రిజిస్ట్రేషన్స్ కుడా జరుగుతున్నాయి. ప్రతి నెల 250 నుంచి 300 రిజిస్ట్రేషన్స్ చేస్తున్నాం. ముఖ్యంగా గిఫ్ట్, సేల్ డీడ్ రిజిస్ట్రేషన్స్ ఎక్కువగా జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: రిజిస్ట్రేషన్ల ద్వారా సంవత్సరానికి జిల్లాకు వచ్చే ఆదాయం ఎంత?

సబ్ రిజిస్ట్రార్: జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,258 రిజిస్ట్రేషన్లు జరిగి ప్రభుత్వానికి రూ. 14.36కోట్ల ఆదాయం సమకూరింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ. 12 కోట్ల వరకు ఆదాయం వచ్చింది.

ఆంధ్రజ్యోతి: రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దళారుల దందా ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సబ్ రిజిస్ట్రార్: మా కార్యాలయంలో అలాంటిదేమీ లేదు. దళారి వ్యవస్థను మేం ప్రోత్సహించం. ప్రభుత్వం చలానుకు మించి ఒక్క రూపాయి కూడా ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: డాక్యుమెంట్ రైటర్‌లను నియంత్రించడంలో విఫలమైనట్లు ఆరోపణలున్నాయి

సబ్ రిజిస్ట్రార్: డాక్యుమెంట్ రైటర్లకు ఎటువంటి గుర్తింపు లేదు. డాక్యుమెంట్ రైటర్లపై తనిఖీలు చేసే అధికారం మాకు లేదు. ప్రజలు రిజిస్ట్రేషన్లపై నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించాలి.మా కార్యాలయ సిబ్బంది పూర్తిగా సహకరిస్తారు. దళారుల వద్దకు వెళ్లి మోసపోకండి.

ఆంధ్రజ్యోతి: ఇళ్ల రిజిస్ట్రేషన్ల విషయంలో జరుగుతున్న అక్రమాలపై ఏమంటారు?

సబ్ రిజిస్ట్రార్: ఇళ్ల రిజిస్ట్రేషన్స్‌లో ప్రజలను కొంత మంది మోసం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. కార్యాలయంలో అక్రమాలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు మధ్యవర్తులకు నమ్మి మోసపోవద్దు. ఏ రిజిస్ట్రేషన్‌కు ఎంత రుసుము చెల్లించాలో కార్యాలయం నుంచి సమాచారం పొంది పూర్తి పత్రాలు సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకోండి.

- భూపాలపల్లి కలెక్టరేట్(ఆంధ్రజ్యోతి)

నూతన భవనంలోకి ఎస్‌బీఐ కాటారం బ్రాంచ్

కాటారం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాటారం బ్రాంచ్ మరో చోటికి షిఫ్ట్ కానుంది. 353(సీ) జాతీయ రహదారి పక్కన చింతకాని క్రాస్ రోడ్డు సమీపంలోని నూతన భవనంలోకి మారనుంది. సోమవారం నుంచి అక్కడ సేలు మొదలుకానున్నాయి. శుక్రవారం బ్యాంక్ సేవలను నిలిపివేసిన బ్యాంక్ అధికారులు, సిబ్బంది మేనేజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో నూతన భవనంలోకి సామగ్రి, ఫైళ్లు, వివిధ రుణాలకు సంబంధించిన డాక్యుమెంట్లు తదితరాలను మార్చేపనిలో నిమగ్నమయ్యారు.

అలంకారప్రాయంగా..

- పనిచేయని సెంట్రల్ లైటింగ్
- 15 రోజులుగా కారుచీకట్లే..
- ప్రధాన రహదారులపై అధికారుల నిర్లక్ష్యం

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుద్దీపాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. సెంట్రల్ లైటింగ్ వెలుగులు లేక నిర్జీవంగా మారాయి. భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన రహదారులపై ఈ దుస్థితి నెలకొంది. ప్రధానంగా హనుమాన్ దేవాలయం నుంచి చెల్పూరు వరకు ఉన్న రోడ్డు కారుచీకట్లలో ముగ్గుతోంది. అప్పటి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఈ నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం జరిగింది. దీనిపై సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. దీంతో పట్టణం సుమారు 7కిలోమీటర్ల మేరకు విద్యుద్దీపాల వెలుగులో సుందరంగా కనిపించేది. ప్రస్తుతం ఆ రోడ్డు కళతప్పింది. ఈ సెంట్రల్ లైటింగ్ వెలగక కారుచీకట్లు అలుముకున్నాయి. 15రోజులుగా ఈ దుస్థితి ఉంది. కారణమేదైనా.. సుమారు 352 విద్యుద్దీపాల్లో కనీసం ఐదు శాతం కూడా వెలగడం లేదని తెలుస్తోంది. పైగా ఇటీవల సెంట్రల్ లైటింగ్ డివైడర్లకు ఇరువైపులా నేషనల్ హైవే అధికారులు ఇనుప గార్డులను వేస్తున్నారు. దీంతో లోపల ఉన్న విద్యుత్ తీగలకు దెబ్బతగిలి పాడైపోయినట్లు పలువురు పట్టణ వాసులు చెబుతున్నారు. ఇదిలావుంటే... పలు సందర్భాల్లో లారీ, టిప్పర్లు విద్యుత్ స్తంభాలకు ఢీకొట్టడంతో విరిగిపోయినవి కూడా ఉన్నాయి. అయితే వారిపై కేసు పెట్టడ మే కాకుండా వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాల్సిన బాధ్యత మునిసిపల్ అధికారులపై ఉంది. ఆ డబ్బులను వసూలు చేశారా? వాటికి లెక్కలేమైనా ఉన్నాయా? అనే విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ వసూలు చేసి ఉంటే.. పాడైపోయిన స్తంభాలను మార్చే వారు కదా? అని అంటున్నారు. ఈ వ్యవహారాలపై ఇప్పటికైనా ఉన్నతాకారులు స్పందించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



భూపాలపల్లి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ వెలగక చీకటిగా ఉన్న రోడ్లు

క్రైం కార్నర్



నర్సిరెడ్డి (ఫైల్), ఇంట్లోకి దూసుకువెళ్లిన కారు, నర్సిరెడ్డి మృతదేహం

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

- వృద్ధుడు దుర్మరణం
- గోవిందరావుపేట మండలం బుస్సాపూర్‌లో ఘటన

గోవిందరావుపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపుతప్పిన ఓ కారు ఇంట్లోకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కట్ల నర్సిరెడ్డి(70) శుక్రవారం సాయంత్రం తన ఇంటి ఆవరణలో కట్టెలు కొడుతున్నాడు. లక్నవరం చెరువు వద్దకు వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి నర్సిరెడ్డి ఇంట్లోకి దూసుకు వెళ్లింది. నర్సిరెడ్డిని ఢీకొనడంతో ఆయన రెండు కాళ్లు తెగిపడి అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు కారులో ఉన్న నలుగురిని బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కారు బ్రేకులు ఫెయిల్ కావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కారులో ఉన్నవారు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వాస్తవ్యులుగా పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలానికి వెళ్లిన పస్రా ఎస్సై కమలాకర్ పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడు నర్సిరెడ్డికి భార్య ధనమ్మ ఉన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

చిట్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన యువకుడు చెవుల శ్రీనివాస్ (24) చిట్యాల మండల కేంద్రంలోని పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి పని నిమిత్తం బయటకు వెళ్లి పెట్రోల్‌బంకు వద్దకు తిరిగి వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి శ్రీనివాస్ కిందపడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి చిన్నమ్మ చెవుల ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యాన్ పట్టివేత



పట్టుకున్న వ్యాన్‌తో పోలీసులు

మహదేవపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుట్కా, తంబాకు, పాన్‌మసాలా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు మండల కేంద్రం శివారులో శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై పవన్ తెలిపారు. పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా కాటారం వైపు నుంచి వచ్చిన గూడ్స్ వ్యాన్ అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో దానిని ఆపి తనిఖీ చేయగా భారీగా గుట్కా, తంబాకు (అంబర్), పాన్‌మసాలా ప్యాకెట్లున్న సంచులు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. 51 సంచుల్లో ఉన్న ఈ పాకెట్ల విలువ సుమారు రూ.7.92 లక్షలు ఉంటుందని చెప్పారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన వేల్పుల సంతోష్, షేక్ పర్వేజ్‌ను అదుపులోకి తీసుకున్నామని, కొంతకాలంగా ఈ ప్యాకెట్లను కిరాణాషాపులకు సరఫరా చేస్తున్నట్టు వారు ఒప్పుకోగా కేసు నమోదు చేశామని వెల్లడించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి
మంత్రి ధనసరి సీతక్క
6లో..

డీటీసీ పుప్పాల శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు
- అద్దె ఇల్లు, ఆఫీసు, జగిత్యాల, హైదరాబాద్‌లో ఏకకాలంలో దాడులు
- పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు



హనుమకొండ దుర్గాకాలనీలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు, వారితో డీటీసీ పుప్పాల శ్రీనివాస్

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో రవాణా శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉప కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హనుమకొండలోని పలివేల్పుల రోడ్డులోని దుర్గాకాలనీలో నివాసం ఉండే కిరాయిఇంటితో పాటు భీమారంలోని ఆర్‌టీఏ కార్యాలయంలోని తన చాంబర్, హైద్రాబాద్‌లోని సొంత ఇళ్లు, స్వగ్రామమైన జగిత్యాల, కరీంనగర్‌లోని బంధువుల ఇళ్లలో ఉదయం 6 గంటల నుంచే సోదాలు నిర్వహించినట్లు వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని విల్లాలతో పాటు ప్లాట్స్, ఇతరత్రా పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నామని, అన్నింటినీ పరిశీలిస్తున్నామన్నారు. పరిశీలన తర్వాత ఏసీబీ డీజీపీ స్వయంగా వివరాలు వెల్లడిస్తారని పేర్కొన్నారు.

కాగా, పుప్పాల శ్రీనివాస్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా, ఎంవీఐగా పనిచేసినట్లుగా రవాణా శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే శ్రీనివాస్ ఉద్యోగ విరమణ ఉన్నట్లుగా తెలుస్తోంది. కాగా, డీటీసీ ఇంట్లో సోదాలతో రవాణా శాఖలోని ఇతర అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్‌టీఏ కార్యాలయాల్లో ఎక్కడ చూసినా ఏసీబీ అధికారుల సోదాలపైనే అధికారులు, సిబ్బంది చర్చించుకోవడం కనిపించింది.

16మంది విద్యార్థులకు అస్వస్థత

- మానుకోట జిల్లా దామరవంచ గురుకులంలో ఘటన
- రాత్రి భోజనం తర్వాత కడుపునొప్పి, వాంతులు
- తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురిని గూడూరు ఆస్పత్రికి తరలింపు
- విద్యార్థులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు



గూడూరు ఆస్పత్రిలో విద్యార్థిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్



చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గూడూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డైట్ చార్జీలు పెంచి.. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మెనూ మార్చినప్పటికి పరిస్థితిలో మాత్రం మార్పురాలేదు. నాణ్యమైన, శుభ్రమైన భోజనం అందక మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 16 మంది విద్యార్థులు శుక్రవారం తెల్లవారుజామున అస్వస్థతకు గురయ్యారు. అందులో నలుగురు తీవ్రంగా, 12 మంది స్వల్ప అనారోగ్యానికి గురవగా.. వారిని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాంతో తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురు విద్యార్థులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గురువారం సాయంత్రం గురుకులంలోని సుమారు 530మంది విద్యార్థులకు స్నాక్స్ కింద గుడాలు.. రాత్రి భోజనంలో అన్నంతో పాటు కాకర కాయ కూర, సాంబారు వడ్డించారు. వారిలో 16 మంది విద్యార్థులకు అర్ధరాత్రి దాటాక కడపునొప్పి, వాంతులు, వీరేచనాలు కావడంతో విషయం తెలుసుకున్న గురుకుల జూనియర్ సీనియర్ ప్రిన్సిపాల్ రమేష్, జూనియర్ ప్రిస్పాపల్ రాజమౌళి, వార్డెన్ అప్పారావు, ఏఎన్ఎం, ఉపాధ్యాయుల సహాయంతో తీవ్ర అస్వస్థతకు గురైన లాకావత్ రాహుల్, గుగులోతు సాయిప్రసాద్, బానోత్ యాకూబ్, బానోత్ అనిల్‌ను గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కలుషిత ఆహారం తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ వీరన్న వెల్లడించారు.

పరామర్శించిన ఎమ్మెల్యే, నేతలు

మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. ఆయనే స్వయంగా స్టెతస్కోప్‌తో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. వైద్యాధికారులతో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు వారికి అందిస్తున్న వైద్యసేవలను తెలియజేయాలని సూచించారు. అలాగే మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కూడా విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గురుకులాలలో ఫుడ్‌పాయిజన్ పరంపర కొనసాగుతుందని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు గురుకులాల బాట పట్టినా వసతిగృహాల్లో ఎలాంటి మార్పురావడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాలు మృత్యుకుహరాలుగా మారాయని విమర్శించారు.

గురుకులాన్ని సందర్శించిన అధికారులు..

దామరవంచ గురుకులంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో వీరస్వామి, తహసీల్దార్ శ్వేత, ఎంపీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కోమల, ఆర్ఐ మల్లయ్య వేర్వేరుగా గురుకులాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులను పరామర్శించారు. ఇక గురుకుల పాఠశాలలో అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, గురుకుల పరిసరాలను పరిశీలించారు. అయితే సదరు గురుకుల ప్రిన్సిపాల్ హేమంత్ సెలవులో ఉన్నారు.

మేడారంలో ముమ్మరంగా ఉచిత వైద్య సేవలు



మేడారంలో వైద్య శిబిరంలో సిబ్బంది

తాడ్వాయి, ఫిబ్రవరి 7, (ఆంధ్రజ్యోతి): మేడారం మినీ జాతరకు వచ్చే భక్తులకు వైద్య సేవలు అందించడానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం, కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు శుక్రవారం వైద్య సేవలందించారు. జ్వర పీడితులకు, డైయోరియా, డిహైడ్రేషన్ తదితర రుగ్మతల పైఅవగాహన కల్పించారు. వైద్యంతోపాటు మందులు అందజేశారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

- హుండీ నగదు, వెండి సామగ్రి అపహరణ



హుండీలో నగదును అపహరిస్తున్న దుండగుడు

ములుగు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ములుగు సమీపంలోని ప్రేమ్‌నగర్ సాయిబాబా ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి గురువారం అర్ధరాత్రి సమయంలో తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. హుండీలోని నగదుతోపాటు బీరువాలో ఉన్న వెండి పూజా సామగ్రిని అపహరించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున గమనించిన అర్చకులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇదే ఆలయంలో ఇంతకుముందు ఐదుసార్లు చోరీ జరిగినట్లు పూజారులు తెలిపారు.

ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ములుగు నియోజకవర్గ నాయకురాలు కుంజ కుసుమాంజలి



కొత్తగూడలో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుతున్న కుసుమాంజలి

కొత్తగూడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సీతక్క కోడలు, ములుగు నియోజకవర్గ నాయకురాలు కుంజ కుసుమాంజలి తెలిపారు. ఓటాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చెన్నూరి సోమయ్య, విజయ్, పోలే రాజు శుక్రవారం కొత్తగూడలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారి కి కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆమె ఆహ్వానించారు. కోనాపురంలో ఇటీవల మృతి చెందిన వల్లపు చంద్రమ్మ కుటుంబసభ్యులను ఆమె పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, పార్టీ యూత్ అధ్యక్షుడు బోయినేని ప్రశాంత్‌రెడ్డి ఓటాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల సారంగపాణి, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నోముల ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి



మహబూబాబాద్ ప్రభుత్వ పాఠశాలలో స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మార్చిలో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి శుక్రవారం ప్రధానోపాధ్యాయులు, ప్రోగ్రాం అధికారులు, ఎంఈవోలులతో జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెన్త్ పరీక్షలకు హాజరైన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ, తక్కువ మార్కులు వచ్చే విద్యార్థులు నిరుత్సాహానికి లోనుకాకుండా వారిని ప్రోత్సహించే విధంగా తల్లిదండ్రులతో మాట్లాడి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీలలో విద్యార్థుల బేస్‌లైన్, మిడ్‌లైన్ ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, మౌళిక వసతుల కల్పన, సౌకర్యం, చిన్న చిన్న మరమ్మతులు చేయడం, ప్రతిపాదనలు, క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ కోర్సు ప్రారంభం మొదలగు త్వరితగతిన చేపట్టాలన్నారు. జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్స్‌కి భాష ఉపాధ్యాయులకు తెలుగు, హింది, ఆంగ్లం శిక్షణ జరుగుతున్న సెంటర్లను సందర్శించారు. ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన చేస్తే ఫ్యూచర్ లెర్నర్స్ ఎక్కు వ ఆసక్తి చూపించి నేర్చుకుంటారని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టడీ ఆవర్స్‌ను సందర్శించి విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. డీఈవో వెంట కోర్సు కోఆర్డినేటర్ చంద్రశేఖర్, క్వాలిటీ కోఆర్డినేటర్ ఆజాద్‌చంద్రశేఖర్, డీఎస్వో అప్పారావు ఉన్నారు.

లక్నవరంలో శ్రీలంక వాసుల సందడి



లక్నవరం చెరువు వద్ద శ్రీలంక దేశస్థులు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రఖ్యాత లక్నవరం చెరువును శ్రీలంక వాసులు శుక్రవారం సందర్శించారు. 15 మందితో పర్యాటకులతో కూడిన బృందం సాయంత్రం చెరువు వద్దకు చేరుకొని బోటింగ్ చేశారు. తీగల వంతెనలపై నుంచి ప్రకృతిని ఆస్వాదించారు. చుట్టూ కొండల నడుమ చెరువు అందాలు అద్భుతంగా ఉన్నాయని కితాబిచ్చారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

● అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ● ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల తనిఖీ ● అందుబాటులో లేని హాస్టల్ వార్డెన్ ● ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్



కస్తూర్బాలో వంటగదిని పరిశీలించి మెనూను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

తొర్రూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తొర్రూరులోని ఇంటిగ్రేటెడ్, కేజీబీవీ హాస్టళ్లను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉంటున్న అధికారులు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేయాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గురుకులాల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో కొన్నేళ్లుగా విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం అందించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు మెనూ ప్రకారమే అందించాలని ఆదేశించారు. ప్రతీ బుధవారం చికెన్, నెలకు రెండు రోజులు గులాబ్ జామ్ ఇవ్వాల్సి ఉండగా అందించడం లేదని, 150 మంది ఉన్న విద్యార్థులకు రోజుకు ప్రభుత్వ నిబంధనల మేరకు వంట సామాన్లు కూడా ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మునిసిపాలిటీలో రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం ఆహారం అందజేయాల్సిందేనని ఆదేశించారు.ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్ రమేష్ అందుబాటులో లేకపోవడంతో సంబంధిత అధికారులకు సమాచారం అందించాల న్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, మునిసిపల్ కమిషనర్ శాంతి కుమార్, మేనేజర్ కట్టస్వామి, ప్రిన్సిపాల్ శైలజ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇనుగుర్తి పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆరోగ్య శాఖ రాష్ట్ర డైరెక్టర్



ఇనుగుర్తి పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న రవీందర్‌నాయక్

ఇనుగుర్తి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవీందర్‌నాయక్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను, నిల్వ ఉన్న మందులను, వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. వైద్యం అందించడంలో వైద్యులు , సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందరంగా ఆయన్ను స్థానిక వైద్యసిబ్బంది శాలువాతో సత్కరించారు. జిల్లా వైద్యాధికారి జి.మురళీధర్, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

● నెల్లికుదురు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నైనాలలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ సాయంత్రం సందర్శించారు. రికార్డులు, మందులను, వైద్యసిబ్బంది పని తీరును పరిశీలించారు. మెరుగైన ఆరోగ్యసేవలు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్, డాక్టర్ సుదీర్‌రెడ్డి, డాక్టర్ సారంగం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : షీ టీఎం ఎస్సై

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు, యాంటీ హ్యూమన్ ట్రాకింగ్‌పై విద్యార్థినులకు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అధ్యక్షతన సైబర్ నేరాలు, యాంటీ హ్యూమన్ ట్రాకింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ...ఆకతాయిలు ఎవరైనా ఎక్కడైనా బాలికలను భయాందోళనకు గురిచేసిన, అసభ్యకరంగా ప్రవర్తించా వెంటనే షీ టీం వాట్సాప్ నెంబర్ : 8712656935కు సమాచారం అందించాలన్నారు. మహిళలు, విద్యార్థినులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. విద్యార్థినులు తప్పని సరిగా ట్రావెల్ సేఫ్ యాప్‌ను ఉపయోగించుకొని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. వ్యక్తిగత, కుటుంబ సమాచారం కాని సామాజిక మాధ్యమాల్లో పెట్టకూడదని, వ్యక్తిగత ఫోటోలు డీపీలు పెట్టుకొవద్దని ఊచించారు. మొబైల్ యాప్‌లలో వచ్చిన అవసరమైన బ్లూ లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరాల బారిన పడినట్లయితే అధైర్యపడకుండా సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. మైనర్లు వాహనాలు నడపవద్దని పేర్కొన్నారు. ఈ సదస్సులో షీ టీం సిబ్బంది అరుణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



బోరునర్సాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క

మంగపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌ను కార్యకర్తలు మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మండలంలోని బోరునర్సాపురంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి ఇంటి ఆవరణంలో శుక్రవారం జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో సీతక్క మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్న దృష్ట్యా కార్యాకర్తలు మరింత నడుంబిగించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. విభేదాలను ఏమైనా ఉంటే పక్కకు పెట్టాలని పార్టీ విధివిధానాలకు కట్టుబడి, రాష్ట్ర కమిటి ఇచ్చిన దిశా నిర్దేశాలను పాటించాలని అన్నారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ములుగు మండలంలో మంత్రి సీతక్క పర్యటన

ములుగు (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్క శుక్రవారం ములుగు మండలంలో పర్యటించారు. ఖాసిందేవిపేటకు చెందిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. జంగాలపల్లి వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన రెడిమిక్స్ ప్లాంట్‌ను ప్రారంభించారు. మంత్రి వెంట డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరు

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి లక్ష్మణ్ బాబు (లక్కీ) వివాహం శుక్రవారం మండల కేంద్రంలోని వై-జంక్షన్ సమీపంలోని బీఆర్. ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వేడకకు మంత్రి సీతక్క హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మంత్రి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, పార్టీ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు అఫ్సర్ తదితరులు ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2303	2100
పల్లికాయ (సూక)	6500	4600
పల్లికాయ (పచ్చిది)	4450	3100
కందులు	6921	5540
పెసళ్లు	6859	5645
పత్తి	6980	5800
పసుపు (కాడి)	8118	7425
పసుపు (గోల)	7002	6703
తేజ మిర్చి	13400	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	14800	11500
యూఎస్341ఏసీ	14000	11500
యూఎస్ 341 కొత్తది	-	-
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మహా ఘట్టానికి అంకురార్పణ

- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు
- 42 ఏళ్ల తర్వాత ఘనంగా వేడుకలు

మహదేవపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రఖ్యాతిగాంచిన కాళేశ్వరం ఆధ్యాత్మిక శోభితంగా మారింది. 42 ఏళ్ల తర్వాత జరుగుతున్న మహాకుంభాభిషేక వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజుల పాటు ఈ మహాఘట్టం జరగనుండగా తొలిరోజైన శుక్రవారం వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చనాపురం వేద పండితుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు తెల్లవారుజామున మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భాజాభజంత్రీల మధ్య కలశాలతో కాళేశ్వరాలయం నుంచి బయల్దేరి త్రివేణి సంగమం గోదావరికి చేరుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి సన్నిధానికి చేరుకున్నారు. అనంతరం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మంగళవాయిద్యాలతో వేద స్వస్తి వాచకాలు, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వర్ణనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశనం, అఖండ జ్యోతి ప్రజ్వలన, యాగశాల ప్రవేశం, నవగ్రహ వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, చతుర్లింగ భద్ర సర్వతో భద్ర మండప దేవతా స్థాపన పూజలు, హోమాలు, చండీపారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం 3.30నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం, చండీ సప్తశతి పారాయణం, నవర్తన మూల మంత్ర జపాలు, సహస్ర ఘటస్థాపన పూజలు, ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి పారాయణం, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

మంత్రోచ్చారణలతో మార్మోగిన ఆలయ పరిసరాలు

కాళేశ్వరాలయంలో 1982 కుంభాభిషేకం జరిగింది. 42 ఏళ్ల తర్వాత ఈ వేడుకలు వైభవంగా జరుగుతుండగా.. మంచిర్యాల జిల్లా అర్చనాపురం గ్రామానికి చెందిన మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో 50 మంది వేద పండితులు, కాళేశ్వరాలయ అర్చకులతో మహా కుంభాభిషేకం ఘనంగా ప్రారంభమైంది. వేదపండితుల మంత్రోచ్చరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఎన్నో సంవత్సరాల తర్వాత ఇలాంటి కార్యక్రమం జరగడం ఆలయానికి, ఊరికి శుభసూచకమని భక్తులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వరంలో అంగరంగ వైభవంగా కుంభాభిషేకం



గోదావరి నుంచి కలశాల్లో జలాలు తీసుకొస్తున్న అర్చకులు, వేద పండితులు

నేడు తుని పీఠాధిపతి రాక

కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాకుంభాషేకానికి ఆదిశంకరాచార్యుల ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తుని తపోవనానికి చెందిన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి హాజరుకానున్నారు. శనివారం జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.



వేద మంత్రాలతో క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

పటిష్ఠ చర్యలు చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేక మహోత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి ఆయన శుక్రవారం పర్యటించారు. 9న జరిగే మహా కుంభాభిషేక ముగింపు కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, రద్దీకి తగట్టు ఏర్పాట్లు చేయాలన్నారు. గోదావరి ఘాట్ వద్ద స్నాన ఘట్టాలను పరిశీలించిన కలెక్టర్ భక్తులు భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించనున్న దృష్ట్యా వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల వాహనాల గోదావరి ఘాట్ వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక పార్కింగ్‌లోనే భక్తులు వాహనాలను తరలించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కుంభాభిషేకంలో పారిశుధ్య నిర్వహణకు 70 మంది కార్మికుల సేవలను వినియోగించుకుంటున్నట్టు తెలిపారు. నాలుగు సెక్టార్లుగా విభజించి పారిశుధ్య నిర్వహణను చేపడుతున్నట్టు చెప్పారు. అత్యవసర సమయంలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షించాలన్నారు. అత్యవసర వైద్య సేవలకు మహదేవ పూర్‌లోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో బెడ్లు కేటాయించినట్లు తెలిపారు. పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పటిష్ఠ బందోబస్తును నిర్వహించాల న్నారు. నిర్దేశిత ప్రాంతం దాటి భక్తులు గోదావరి లోకి వెళ్లకుండా నియంత్రించాలన్నారు. 9వ తేదీన ఆలయ ప్రధాన ద్వారం వద్దకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీపీవో నారాయణరావు, మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈవో మహేష్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

మహా కుంభాభిషేకానికి ముగ్గురు మంత్రుల రాక

రేపు జరిగే కార్యక్రమాలకు హాజరు



మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి కొండా సురేఖ



మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలో జరుగుతున్న కుంభాభిషేకానికి ముగ్గురు మంత్రులు హాజరుకానున్నారు. మూడు రోజులపాటు ఈ వేడుక జరుగుతుండగా చివరి రోజు ఆదివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. మంత్రులతోపాటు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరుకానున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి ఉండగా మంత్రులు, ఎంపీ నిబంధనలకు కట్టుబడే ఈ వేడుకల్లో పాల్గొనన్నుట్టు తెలిపారు.

50 ఏళ్లకు కలుసుకున్నారు..

నిట్‌లో 1970- 75 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం

హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ 1970-75 సంవత్సరం స్వర్ణోత్సవ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిట్ క్యాంపస్‌లోని బోస్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనంలో 50 ఏళ్ల కిందట చదువుకున్న సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలనాటి తమ కళాశాల మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. కళాశాలలో చదువు ముగించుకొని బయటకు వచ్చిన తర్వాత అయిదు దశాబ్దాల్లో తాము సాధించిన విజయాలను పరస్పరం పంచుకున్నారు. ఆ నాడు తాము చదువుకున్న తరగతి గదులను, క్యాంపస్‌లో తాము తిరిగిన ప్రదేశాలను మరోసారి సందర్శించారు. కళాశాల అభివృద్ధికి అమూల్యమైన సేవలు అందించిన ప్రముఖులు రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ ఎస్. శిరీష్ డీన్ (సంశోధన, అభివృద్ధి) ప్రొఫెసర్ ఎ.వేణు వినోద్ (డీన్, ఫ్యాకల్టీ వెల్ఫేర్) వరంగల్ నిట్ అల్యూమినీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.రామ తదితరులను ఈ సందర్భంగా సత్కరించారు.



వరంగల్ నిట్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 50ఏళ్ల నాటి స్నేహితులు

స్థానికంలో బీసీల హవా!

5వ పేజీ తరువాయి



బీసీలు 14,28,043మంది ఉన్నట్లుగా గుర్తించారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అత్యధికంగా గిరిజనులున్నారు. అయినా ఉమ్మడి జిల్లాల్లో బీసీలు 40శాతానికి పైగా ఉన్నట్టు తేలింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కల గణనలో ఉమ్మడి జిల్లాలో బీసీల జనాభా మరింత పెరిగిందని, 45శాతానికి పైగా ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాలు పట్టుబడుతున్నాయి. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేవలం 22శాతం రిజర్వేషన్ కల్పించారు. అయినా అవకాశాన్ని బట్టి జనరల్ స్థానాల్లో పోటీ చేసి, 35 నుంచి 40శాతం వరకు బీసీలు ఎన్నికల్లో సత్తా చాటారు. రాజకీయ చైతన్యం ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ డిమాండ్‌తోనే గత ఆదివారం వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బీసీ ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో బహిరంగ సభ కూడా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు చేసిన కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు.

2019 ఎన్నికల్లో పెరిగిన బీసీల ప్రాతినిధ్యం

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బీసీలు రాజకీయంగా చైతన్యం అవుతున్నారు. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం కేవలం 22శాతమే రిజర్వేషన్లు కల్పించింది. అయినప్పటికి జనరల్ స్థానాల్లో పోటీ చేసి బీసీలు సత్తా చాటారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,167 జీపీలకు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో బీసీలకు 212 సర్పంచ్ స్థానాలు రిజర్వుడు చేశారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో బీసీలకు 22శాతం కాకుండా, అక్కడ జనాభా అధారంగా సీట్లు దక్కాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో బీసీల సీట్లకు కోత పడింది. అయినా ఈ రిజర్వేషన్‌తో అవకాశం వచ్చిన సర్పంచ్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. మొత్తం 1,167 స్థానాల్లో 422 సీట్లలో బీసీలు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. అదనంగా 200 జనరల్ స్థానాల్లో బీసీలు పాగా వేశారు. మొత్తంగా 25.5శాతం సీట్లు బీసీల పరమయ్యాయి. అలాగే ఎంపీటీసీ స్థానాల్లోనూ బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 764 స్థానాలుండగా, బీసీలకు 114 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు అయ్యాయి. వీటితో పాటు జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి అదనంగా మరో 163 స్థానాల్లో విజయం సాధించారు. మొత్తం 277స్థానాల్లో బీసీలు ఎంపీటీసీలుగా ఎంపికయ్యారు. తమకు కేటాయించిన స్థానాలకంటే రెండింతలు అధికంగా విజయం సాధించారు. మొత్తంగా 36.3శాతం సీట్లను బీసీలు కైవసం చేసుకుని రాజకీయంగా ఎంతో చైతన్యవంతులో చాటి చెప్పారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70జడ్పీటీసీలు ఉండగా, 9జడ్పీటీసీలే బీసీలకు రిజర్వు అయ్యాయి. అయితే జనరల్ స్థానాల్లో పోటీ చేసి మరో 11స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. మొత్తంగా 20మంది జడ్పీటీసీలు బీసీలు ఎన్నికయ్యారు. కోటకంటే అధనంగా 29శాతం మంది బీసీలు జడ్పీటీసీలుగా విజయం సాధించారు.

జనరల్ కోటాలో బీసీల పట్టు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీలు తమ కోటాకు మించి విజయం సాధించారు. గిరిజనులు అధికంగా ప్రాంతాల్లో అధిక సీట్లు గిరిజనులకే కేటాయించారు. దీంతో ఆ జిల్లాల్లో బీసీల జనాభా ఆధారంగా సీట్లు లభించాయి. మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా గిరిజన జనాభే ఉంది. ఈ జిల్లాలో 16మంది జడ్పీటీసీ స్థానాలున్నాయి. అయితే ఈ జిల్లాలో అధికంగా ఎస్టీలు ఉండటంతో పాటు ఆరు మండలాల్లో పెసా చట్టం అమల్లో ఉంది. గిరిజన ప్రాబల్య ప్రాంతం కావటంతో 2019లో జరిగిన ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లాల్లో బీసీలకు ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా రిజర్వేషన్ లేదు. అయినప్పటికి ఇక్కడ జనరల్ స్థానాల్లో పోటీ చేసి ఇద్దరు బీసీ అభ్యర్థులు జడ్పీటీసీలుగా విజయం సాధించారు. ఇదే జిల్లాలో ఎంపీటీసీల్లోనూ బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో సత్తా చాటారు. మహబూబాబాద్ జిల్లాల్లో మొత్తం 198 ఎంపీటీసీ స్థానాలు ఉంటే కేవలం బీసీలకు ఐదు స్థానాలే రిజర్వేషన్ చేశారు. కానీ, అప్పటి ఎన్నికల్లో మరో 32ఎంపీటీసీ జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. దాంతో మహబూబాబాద్ గిరిజన జిల్లాలో మొత్తం 37మంది బీసీలు ఎంపీటీసీలుగా విజయం సాధించారు.

వరంగల్ జిల్లాలో 11జడ్పీటీసీ స్థానాలు ఉంటే బీసీలకు ఒకటే స్థానం రిజర్వుడు చేశారు. మరో నాలుగు జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. ములుగు జిల్లాల్లో 150 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగితే బీసీలకు కేవలం ఆరు జీపీలే రిజర్వు అయ్యాయి. అయినప్పటికి జనరల్ స్థానాల్లోపోటీ చేసి 29మంది బీసీ సర్పంచ్‌లు విజయం సాధించారు. భూపాలపల్లి, హనుమకొండ, జనగామ జిల్లాల్లోనూ బీసీలు అధికంగా ఉన్నారు.

2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీసీల ప్రాతినిధ్యం ఇలా

	వరంగల్	హనుమకొండ	జనగామ	మానుకోట	భూపాలపల్లి	ములుగు
గ్రామ పంచాయతీలు	325	210	281	461	240	150
బీసీ రిజర్వుడు	48	46	39	22	51	06
మొత్తం బీసీలు నెగ్గినవి	63	68	95	67	100	29
మొత్తం ఎంపీటీసీలు	134	130	128	198	102	72
బీసీ రిజర్వుడు	35	30	17	5	23	25
మొత్తం బీసీలు నెగ్గినవి	53	63	55	37	43	26
మొత్తం జడ్పీటీసీలు	11	12	12	16	11	08
బీసీ రిజర్వుడు	01	03	01	00	02	02
మొత్తం బీసీలు నెగ్గినవి	05	05	01	02	04	03

సంగీతంలో ఓలలాడిన కళాక్షేత్రం

- ఘనంగా విద్యారణ్య సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవం
- వేడుకలు ప్రారంభించి కీర్తనలు ఆలపించిన కలెక్టర్ ప్రావీణ్య
- సంగీతం, నృత్య మేళవింపుతో హోరెత్తిన కాళోజీ ఆడిటోరియం

నేత్ర పర్వం



భద్రకాళి శేషును సత్కరిస్తున్న కలెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం నగరంలోని సంగీత ప్రియులతో ఓలలాడింది. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన వేడుకల పరంపర.. రాత్రి 9గంటల వరకు కొనసాగుతూనే ఉంది. కళాకారులు, కళాభిమానులతో ఆడిటోరియం కిక్కిరిసింది. వరంగల్‌లోని విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య లాంఛనంగా జ్యోతి వెలిగించి స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించారు. అనంతరం సంగీత ప్రపంచంలో ప్రముఖులైన వారి పంచరత్న కీర్తనల గోష్టి గానంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొనడమే గాక.. గాయనీ గాయకులతో కలిసి 'దుడుకు గల నన్నే దొర కొడుతూ..' అనే కీర్తనతో శృతి కలిపి అద్భుతంగా ఆలపించారు. ఆమె రెండు గంటల పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వర్ణోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న కలెక్టర్ పి. ప్రావీణ్య

స్వర్ణోత్సవాల వేళ సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవాలు, పండిట్ నారాయణ్ భాత్ఖండే, పండిట్ విష్ణు దిగంబర్ పలుస్కర్ ఉత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పంచరత్న కీర్తలను ఆలపించిన ప్రముఖులలో జిల్లా కలెక్టర్‌తోపాటు ఆచార్య తిరుపతయ్య, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రముఖ విద్వాంసుడు వాసా గోపీనాథ్, భద్రకాళిశేషు, సింగారపు భాస్కర్, వొద్దిరాజు నివేదిత, సుహిత, ఉమ్మడి లక్ష్మణాచార్య, లాయక్, జియాహుద్దీన్, చిన్న, కుంట రాజు, పద్మజ తదితర అనేక మంది గాయకులు సంగీత కళాశాల కర్ణాటక గాత్ర ప్రస్తుత, పూర్వ విద్యార్థులు పాల్గొని సంకీర్తనలను ఆలపించారు. ఈ సందర్భంగా విద్యారణ్య సంగీత కళాశాల విద్యార్థులు ప్రభుత్వ గురుకులాల్లో ఉద్యోగాలు సంపాదించుకున్న సుహిత, శివలీల, నవ్య తదితర 8మందిని సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల పరంపరలో భాగంగా నగరంలోని ప్రముఖ నాట్యాచార్యులు బొంపెల్లి సుధీర్‌కుమార్, తాడూరి రేణుక, వెంపటి శ్రావణి, ఝాన్సీ, జయశ్రీ, పరమేశ్వర్, రుద్రవేణు, చైతన్య తదితరుల శిష్య బృందంతో ఒకదానివెంట ఒకటి సంప్రదాయ కూచిపూడి, భరత నాట్యాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. ఈ సందర్భంగా సంగీత కళాశాల పేరిణి నాట్యాచారులు గజ్జెల రంజిత్, నవ్యజ శిష్య బృందంచే అద్భుత పేరిణి నృత్య ప్రదర్శన కూడా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు సితార్ విద్వాంసులు జక్కు సత్యనారాయణ, హిందుస్థానీ గాత్ర విద్వాంసురాలు అనుమలు యోష, మృదంగ విద్వాంసులు ఏడిద భీంశంకర్, వయోలిన్ విద్వాంసులు చిన్ని కృష్ణ, కర్ణాటక గాత్ర విద్వాంసులు ఎస్.భాస్కర్ శిష్య బృందం కూడా ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు.

కళాకారులు అభినందనీయులు

కళలకు కాణాచి అయిన ఓరుగల్లు నగరంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాల కళాకారుల పాలిట గొప్ప వరమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కొనియాడారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులందరినీ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పేరుగడించిన ఈ కళాశాల విద్యార్థులెందరో జాతీయ స్థాయిలోనూ గొప్ప కళాకారులుగా పేరు గడించడం హర్షించదగ్గ విషయమన్నారు.


ఎంతో భాగ్యం

ఎందరెందరో ఉద్దండులైన విద్వాంసుల ఆధ్వర్యంలో 52 వసంతాలు పూర్తి చేసుకున్న ఓరుగల్లు విద్యారణ్య సంగీత కళాశాలకు స్వర్ణోత్సవ వేళ తాను ప్రిన్సిపాల్‌గా ఉండడం ఎంతో భాగ్యమని ఈ కార్యక్రమాలను రూపొందించిన ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌కుమార్ అన్నారు. తమ కళాశాలకు అన్ని వసతులు సమకూర్చితే మరింతగా కళాకారులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దుతామన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ , మున్సిపల్ కమిషనర్, సాంస్కృతిక శాఖ సంచాలకుల సంపూర్ణ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓని విజయ్‌తోపాటు నగరంలోని సంగీత, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





నృత్యం చేస్తున్న చిన్నారులు



జాతీయ రహదారి పనులు ముమ్మరం

రూ. 120 కోట్లతో ఫోర్‌వే • జగన్నాథపురం-చెరుకూరు వరకు నిర్మాణం



ఫోర్‌వేగా మారనున్న జాతీయ రహదారి



ముమ్మరంగా కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు

వాజేడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. డబుల్ రోడ్డుగా ఉన్న జాతీయ రహదారి 11 కిలోమీటర్ల మేర నాలుగు లైన్లగా మారనుంది. ఇందుకు జాతీయ రహదారుల శాఖ రూ. 120 కోట్ల నిధులను మంజూరు చేసింది. మండలంలోని జగన్నాథపురం నుంచి చెరుకూరు వరకు ఈ రహదారిని నిర్మిస్తున్నారు. ఈ పనులను రాష్ట్రంలోని ఓ కాంట్రాక్టు సంస్థ దక్కించుకుంది. 2022లో వరద ముంపునకు జాతీయ రహదారి గురికావడంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా మార్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గోదావరి వరదల సమయంలో మండలంలోని దూలాపురం నుంచి చెరుకూరు వరకు గల జాతీయ రహదారి తరుచూ నీట మునిగి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో ఫోర్‌వే నిర్మాణ పనులతో ఏజెన్సీ ప్రజలకు రహదారి ఇబ్బందులు తొలగి పోనున్నాయి. జగన్నాథపురం నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు టేకులగుడెం వరకు సుమారు 30 కిలోమీటర్ల దూరం ఉండగా ప్రస్తుతం 11 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పనులు ఊపందుకున్నాయి.

కట్టడాల తొలగింపు

రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సంబంధిత కాంట్రాక్టరు నిబంధనల మేరకు రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాల తొలగింపు పనులను దాదాపుగా పూర్తి చేశారు. గ్రామాలలో ప్రస్తుతం ఉన్న రహదారి మధ్యలోంచి 50 అడుగుల మేర అడ్డుగా ఉన్న భవనాలు, రేకుల షెడ్డులు, దుఖాణాల సముదాయాలను తొలగిస్తున్నారు. జగన్నాథ పురం-చెరుకూరు వరకు రహదారి నిర్మాణంలో తొలగింపులు చాలా వరకు పూర్తయ్యాయి. అక్కడక్కడ ఉన్న భవనాల నిర్మాణాలను తొలగిం చేందుకు సంబంధిత యజమానులతో చర్చలు జరుపుతున్నారు. కాగా మొదట్లో కూల్చివేతల్లో పక్షపాతం వహిస్తున్నారని ఆరోపణలు రావటంతో ముందుగా రోడ్డుకు అడ్డుగా ఉన్న బడా బాబులు ఇళ్లకు సంబంధించి ప్రహరీలను కూల్చివేశారు. ఈ క్రమంలో పేదల ఇళ్ల, చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

మిషన్ భగీరథ పనులు షురూ

జాతీయ రహదారిని అనుకొని గతంలో మిషన్ భగీరథ పైపులైన్లు ఏర్పాటు చేయటంతో ప్రస్తుతం ఆ పైపులైన్లను తొలగించి 50 అడుగుల దూరంలో పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సుమారు 12 జీపీల వరకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జీపీ అధికారులు వాటర్ ట్యాంకు సాయంతో పలు గ్రామాలకు తాగునీటి సరఫరాను చేస్తున్నారు. ఈ పనులు మరో నెల రోజుల పాటు సాగనుండటంతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తప్పేలా లేవని ప్రజలు వాపోతున్నారు. త్వరితగతిన మిషన్ భగీరథ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా మండలంలోని పాయబాట్ల, పెద్దగొల్లగుడెంలలో వాటర్‌ట్యాంకుల నిర్మాణాలను తొలగించి నూతన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

సర్వీసు రోడ్డు, సెంట్రల్ లైటింగ్

జాతీయ రహదారి నాలుగులైన్లుగా మర నుండటంతో గ్రామాలను ఆనుకొని ఉన్న జాతీయ రహదారి సర్వీసు రోడ్డును అనుసందానం చేయనున్నారు. అదే విధంగా సెంట్రల్ లైటింగ్‌ను కూడా ఏర్పాటు చేయనుండటంతో రాబోయే రోజుల లో ఏజెన్సీ ప్రాంతం మరింత ఆకర్షణీయంగా కనిపిం చనుంది. జాతీయ రహదారి దెబ్బతినకుండా పొడవునా డ్రైయినేజీని సైతం ఏర్పాటు చేస్తున్నారు.

పెరిగిన రవాణా

భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారికి రోజు రోజుకూ ట్రాఫిక్ పెరుగుతోంది. ప్రధానంగా ఛత్తీస్‌గడ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ వందలాది భారీ వాహనాలు హైదరాబాద్‌తో పాటు తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతులు, దిగుమతులకు ఈ జాతీయ రహదారి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాల రద్దీతో ఇరుకుగా ఉన్న రహదారిపై ప్రమాదాలు గత పదేళ్లలో భారీగా పెరిగాయి. నాలుగు లైన్ల రహదారితో అవి తగ్గే ఆస్కారం ఉందని స్థానికులు అంటున్నారు.

ఎస్సీ వర్గీకరణకు బీసీ సంఘం మద్దతు

తాడ్వాయి, ఫిబ్రవరి 7, (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేపట్టిన ఎస్సీ వర్గీకరణ పోరాటానికి బీసీ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు వలన శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్షడప్పులు, వేలాది గొంతులు సాంస్కృతిక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.

రామప్పను సందర్శించిన శ్రీలంక దేశస్థులు



రామప్ప దేవాలయంలో శిల్పాలను తిలకిస్తున్న శ్రీలంక దేశస్థులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక దేశానికి చెందిన ట్రావెల్స్ అండ్ టూర్ ఆపరేటర్స్ 10 మంది ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ నుంచి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గైడ్ల ద్వారా ఆలయ చరిత్రను తెలుసుకొని మంత్రముగ్ధులయ్యారు. వారు విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో సుమారు వారం రోజుల పాటు పర్యటించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే రామప్పను సందర్శించామని తెలిపారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకొని బోటింగ్ చేశారు.

గ్రావెల్ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

వాజేడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీఐ కాలేజీ సమీపం నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నాయకులు శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావుతో పాటు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు జెజ్జరి దామోదర్ మాట్లాడుతూ అనుమతులు ఇచ్చిన భూమిలో కాకుండా జియో కోఆర్డినేట్స్‌ను దాటి మైనింగ్ చేస్తున్నారని అన్నారు. అక్రమంగా మైనింగ్ చేస్తూ వాజేడు మండలం నుంచి పక్క మండలం ఏటూ రు నాగారం తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు.

నులి పురుగుల నిర్మూళపై టాస్క్‌ఫోర్సు సమావేశం

వాజేడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూళన కార్యక్రమం ఈ నెల 10 నుంచి 17 వరకు ఉన్న నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో టాస్క్‌ఫోర్సు సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, హైస్కూల్ హెచ్‌ఎం ఆనందరావు, వైద్యాధికారి మహేందర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. 1-19 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. పోషకాహార లోపంతో పిల్లలలో బుద్ధి మాంద్యం, ఏకగ్రత లోపించడం, మానసిక ఎదుగుదల సరిగా లేకపోవడం వంటి లక్షణాలు నులిపురుగులతో వస్తాయని, వాటి నివారణకు అల్బెండాజోల్ మాత్రలను నమిలి మింగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్‌లు వెంకటరమణ, కోటిరెడ్డి, ఏఎన్‌ఎంలు నాగేంద్ర కుమారి, సత్యనాగవేణి, లలిత కుమారి, ఛాయాదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బిల్లులను విడుదల చేయాలి

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలోత్ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీజీయూఎస్ క్యాలెండర్‌ను జిల్లా ఏసీజీ మండల రవీందర్‌రెడ్డి, ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకర రాజేశ్వర్‌రావుతో కలిసి ప్రతాప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీల్లో జరిగిన అవకతవకలను వెంటనే సవరించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య, డీఆర్‌పీ సురేష్, శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనను విజయవంతం చేయండి

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించాలని ఈ నెల 8న చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు రమణారెడ్డి, సేవానాయక్, ప్రవీణ్ కోరారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నిధులు కేటాయించాలని, లేకపోతే ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగానే ఈ నెల 8న నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వయోజన అక్షరాస్యతపై అవగాహన

కాటారం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాంపల్లి బేతెస్థ ప్రార్థనా మందిరంలో శుక్రవారం సేవాభారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్యవిద్య, వయోజన అక్షరాస్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యవిద్యపై అవగాహన కల్గి ఉంటే పలు రకాల వ్యాధులు దరిచేరవని, దీంతో డబ్బు ఆదా చేయొచ్చని సేవాభారత్ నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, రమేష్ అన్నారు. యువతీ యువకులకు స్వయం ఉపాధిలో భాగంగా హెర్బల్ సర్ఫ్, షాంపు, నొప్పులను నివారించే తైలం, బామ్‌ల తయారీపై శిక్షణనిచ్చారు. పలువురికి కూరగాయల విత్త నాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు డేవిడ్‌రవీందర్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



అఖిలాష్ అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

చిట్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి కొటం అబిలాష్ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షి ప్‌నకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ప్రధానో పా ధ్యాయుడు గిరగాని కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థి అబిలా ష్‌ను సత్కరించారు. గ్రామస్థులు జంబుల తిరుపతి, పోరెడ్డి సుదర్శ న్‌రెడ్డి, కుర్మిళ్ల కుమారస్వామి, ఉపాధ్యాయులు రాధికరాణి, ఉమా దేవి, రంజిత్‌కుమార్, రఫీ, స్వరూప, రవీందర్, శ్రీనివాస్, యోగానందాచారి పాల్గొన్నారు.

నేటి నుంచి గొంతెమ్మగుట్ట జాతర

కాటారం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతాపగిరి అటవీప్రాంతంలో గొంతెమ్మగుట్టపై లక్ష్మీదేవర జాతర శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి మూడు రోజులపాటు అవి కనసాగనున్నాయి. గొంతెమ్మ గుట్టపై శుక్రవారం ఆదివాసీ నాయకపోడ్ సంఘం సభ్యులు, నిర్వహణ కమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లును మొదలెట్టారు. పాండవభేరి వద్ద శుభ్రం చేసి పచ్చని పందిళ్ల వేస్తున్నారు. భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల నుంచి లక్ష్మీదేవరలు వస్తాయని జాతర నిర్వాహకులు తెలిపారు. వేలాదిమంది భక్తులు జాతరలో పాల్గొని మొక్కులు సమర్పించుకోనున్నారు. కాగా మూడు రోజుల పాటు జరిగే జాతర ఉత్సవాల్లో మొదటి రోజైన శనివారం మద్దిపల్లి లక్ష్మీదేవరకు కాళేశ్వర త్రివేణి సంగమంలో పవిత్రస్నానం, ప్రతాపగిరి కోట ప్రధాన ద్వారం వద్ద మైసమ్మ పూజలు, ఆదివారం గొంతెమ్మగుట్టపై గల దేవతల విగ్రహాలకు గోదావరి జలాలతో అభిషేకం, పాండవుల భేరి వద్ద ఆంజనేయ పతాకారోహణం, లక్ష్మీదేవరలు కొలువుదీరడం, అర్ధరాత్రి పెద్దపట్నం వేయడం, లక్ష్మీదేవరల విన్యాసాలు, సోమవారం లక్ష్మీదేవరలు పెద్ద పట్నం తొక్కే కార్యక్రమాలు, లక్ష్మీదేవరలు, భక్తులు గుట్ట అవరోహణం, నాయక్‌పోడ్ బృందాలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.



గొంతెమ్మగుట్టపై పాండవుల భేరి వద్ద వివిధ పనుల్లో నిర్వాహకులు

తాగునీటి కోసం గిరిజనుల ఆందోళన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

వాజేడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వేసకాలం సమీపిస్తున్న వేళ ఏజెన్సీల తాగునీటికి అవస్థలు మొదలయ్యాయి. మండల కేంద్రంలోని పెనుగోలుకాలనీలో నెల రోజులుగా ఆదివాసీలు తాగునీరు లేక అల్లాడుతున్నారు. గుట్టలు దిగి వచ్చి మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పెనుగోలు ఆదివాసీలకు గతంలో సోలార్ వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. 5000లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకుతో ప్రతి రోజూ కాలనీలో ఆదివాసీలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ క్రమంలో నెల రోజుల నుంచి సోలార్ మోటారు మరమ్మతులకు గురి కావడంతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో శుక్రవారం పెనుగోలు కాలనీలోని సోలార్ వాటర్ ట్యాంకు వద్ద గిరిజనులు ఆందోళనకు దిగారు. తమ దాహార్తి తీర్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు తాగలేకపోతున్నామని, దానితో చర్మవ్యాధులు, ఇతర రోగాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత సోలార్ వాటర్ ట్యాంకు ద్వారా వచ్చే తాగునీరు తమకు అనువుగా ఉంటుందని, దానినే అధికారులు సరఫరా చేయాలని కోరారు. ఈ విషయంపై ఎంపీవో శ్రీకాంత్ నాయుడుని వివరణ కోరగా సోలార్ మోటారును తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని, అప్పటి వరకు మిషన్ భగీరథ తాగునీటిని ఉపయోగించుకోవాలని సూచించామని చెప్పారు. మిషన్ భగీరథ తాగునీటితో ఎలాంటి వ్యాధులు రావ, అవన్నీ అపోహలు మాత్రమేనని అన్నారు.

తెనాలి నుంచి కాళేశ్వరానికి..

కుంభాభిషేకంలో ఆంధ్రా పారిశుధ్య కార్మికులు



పారిశుధ్య కార్మికులతో డీపీవో నారాయణరావు

మహదేవపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి మహా కుంభాభిషేకానికి తెనాలి నుంచి పారిశుధ్య కార్మికులను రప్పించారు. సుమారు 40 మంది కుంభాభిషేకం విధుల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) నారాయణరావు మాట్లాడుతూ కుంభాభిషేకంలో పరిసరాల పరిశుభ్రత కీలకమన్నారు. అందుకు తెనాలికి చెందిన కార్మికులను రప్పించామని అన్నారు. కాళేశ్వర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో, ఎంపీవోలు, కార్యద ర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీపీవో మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగనున్న మహా కుంభాభిషేకం కార్యక్రమాల్లో పారిశుధ్య కార్యక్రమాలు కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవోలు ప్రసాద్, వీరస్వామి, ప్రకాష్, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

అందుబాటులో అంబులెన్స్‌లు

కాళేశ్వరంలో జరుగుతున్న కుంభాభిషేకం నేపథ్యంలో రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. ఈమేరకు 108 డిస్ట్రిక్ మేనేజర్ మేరుగు నరేష్‌యాదవ్ తెలిపారు. ఒకటి టెంపుల్ దగ్గర, మరొకటి మహదేవపూర్ ఆస్పత్రిలో అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. ఈ సేవలను భక్తులతోపాటు కాళే శ్వరం పరిసర ప్రజలు సద్వినియోగం వినియోగించుకోవాలని తెలిపారు. అంబులెన్స్‌ల సేవల్లో 108 స్టాఫ్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ మహేష్, శీలపాక రాజు, పైలెట్ సంపత్, శ్రీనివాస్ పాల్గొంటున్నారు.

పోలీసుల భారీ బందోబస్తు

ఆలయంలోని మహా కుంభాభిషేకానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారనే ముందు చూపుతో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు బలగాలను పెద్ద ఎత్తున మోహరించారు. పుష్కరఘాట్, గోదావరి ఘాట్, ప్రధాన ఘాట్ వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లతో పకడ్బందీ చర్యలు చేపట్టారు.రెండు రాష్ట్రాల వంతెనపై తనిఖీలను ముమ్మరం చేశారు.

బ్రిడ్జిలు కట్టి అభివృద్ధి అనడం అవివేకం

మల్హర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : రెండు, మూడు బ్రిడ్జిలను కట్టి అభివృద్ధి అనడం బీఆర్‌ఎస్ నాయకుల అవివేకానికి నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించారు. మండల కేంద్రమైన తాడిచర్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తాడిచర్ల, భూపాలపల్లి రోడ్డు నిర్మాణం కేవలం మంత్రి శ్రీధర్ బాబుతోనే సాధ్యమన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. అభివృద్ధికి ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ అప్పులపాల్జేస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, పీఏసీఎస్ ఛైర్మన్ ఇప్ప మొండయ్య, వైస్ ఛైర్మన్ ప్రకాశ్‌రావు, నాయకులు మండల రాహుల్, గడ్డం క్రాంతి, చంద్రయ్య, శ్రీను, కుంట నది, వెంకటస్వామి, తిర్రి సమ్మయ్య, మహేష్, మేనం సతీష్, దుర్గప్రసాద్, ఆంజనేయులు, మధు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 7: మండలంలోని బుట్టాయిగూడెం పంచాయతీ పరిధి కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి నాగేశ్వరరావు గత నెలలో గ్రామ సభలో ఆత్మహత్యాయత్నం చేసి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని నేతకాని రిజర్వేషన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యకుడు కావేరి చిన్ని కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్య శుక్రవారం పరామర్శించారు. నాగేశ్వరరావు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని విమర్శించారు. ఆయన కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కావేరి భిక్కయ్య, రమేష్, రాజబాబు, నరసింహరావు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న టీచర్లు

కాటారం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని కాటారం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన కొండ ప్రణయ్ కుమార్ అనే విద్యార్థి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపిక య్యాడు. ప్రణయ్ కుమార్‌కు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ప్రతి ఏటా రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్ అందనుంది. ఎన్ఎంఎంఎస్ సాధించిన ప్రణయ్‌కుమార్‌ను శుక్రవారం ఇన్‌చార్జి హెచ్ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు సతీష్, పద్మజ, రజిత, సుజాత, రాజు, శ్రీధర్ అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో

పొరపాట్లు జరగొద్దు

- జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి మహేందర్‌జీ
- ఎలక్షన్లపై పీవో, ఏపీవోలకు శిక్షణ



మాట్లాడుతున్న మహేందర్‌జీ

ములుగు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా జరిపించాలని, ఎలాంటి పొరపాటు జరగ కుండా జాగ్రత్త వహించాలని జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ అన్నారు. ఎన్నికల విధుల కోసం నియమించబడ్డ ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహేందర్‌జీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన హ్యాండ్‌బుక్‌లోని సూచనలను పక్కాగా పాటించా లన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను పోలింగ్ కేంద్రంలో ప్రదర్శించాలని, ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరపడం వంటి అంశాలపై జాగ్రత్త వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలు, లోపలికి ఎవ్వరిని అనుమతించాలనే విషయాలలో పీవో, ఏపీవోల మధ్య అవగాహన, సమన్వయం ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ విజయ భాస్కర్, సూపరింటెండెంట్ శివకుమార్

పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

బాలల భవిష్యత్తే దేశ భవిష్యత్తని, పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో వైద్యఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ అన్నారు. ఈనెల 10న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ మీటింగ్ జరిగింది. జిల్లాలో 73,244మంది 19ఏళ్లలోపు బాలలు ఉన్నారని, వారందరికీ అల్బెండజోల్ మాత్రలు సరఫరా చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఈమేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాలరావు, వ్యాధినిరోధక టీకాల జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రణధీర్, ఆర్డీవో వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.